సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 30 । జూలై । 2024



ఫైనాన్స్ మాఫియా

ఆటోమొబైల్ వ్యాపారంలో బడా ఆర్థిక నేరం.. బడుగులే టార్గెట్.. యువత కోరికలు, బలహీనతలే కాసులు కురిపిస్తున్నాయి.

వివరాలు 10లో ▸



ఘోర రోడ్డు ప్రమాదం

శుభకార్యానికి వెళ్లి తిరుగొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ఆరుగురు గాయపడ్డారు.

వివరాలు 10లో ▸



కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా..

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోంది.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

వర్గల్‌ను సందర్శించిన స్థపతి ఆనందసాయి



సూచనలిస్తున్న స్థపతి ఆనందసాయి

వర్గల్(గజ్వేల్): ప్రముఖ వాస్తు నిపుణులు, యాదాద్రి ఆలయ స్థపతి ఆనందసాయి సోమవారం వర్గల్‌ను సందర్శించారు. స్థానిక విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘ ప్రతినిధులు పెంటాచారి, బ్రహ్మచారి, యేగొండ చారి బృందం ఆయనకు సాదర స్వాగతం పలికింది. వారితో కలిసి నిర్మాణంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని పరిశీలించారు. నిర్మాణంలో వాస్తుపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. అనంతరం సంఘం తరపున ఆయనను ఘనంగా సన్మానించారు.

సినారె సాహిత్యం అజరామరం



సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి సాహిత్యం అజరామరం అని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఎన్నవెల్లి రాజమౌళి అన్నారు. సి.నారాయణరెడ్డి జయంతిని జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినారె చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ విశ్వవ్యాప్తంగా ఖ్యాతిగాంచిన కవి సినారె అని అన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించి, అనేక ప్రక్రియలలో రచనలు చేసి, విశ్వవ్యాప్తంగా ఖ్యాతి గడించారన్నారు. కార్యక్రమంలో బాలసాహితీవేత్తలు, కవులు, ఉండాళ్లరాజేశం, వర్కోలు లక్ష్మయ్య, సింగీతం నరసింహారావు, బస్వరాజ్ కుమార్, కోణం పర్శరాములు, గంగాపురం శ్రీనివాస్, మిట్టపల్లి పరశురాములు, యాడవరం చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల్లో చైతన్యం రావాలి



మాట్లాడుతున్న కాస్తీ శ్రీనివాస్, శ్రీరాం రామకృష్ణ తదితరులు

దుబ్బాకటౌన్: ప్రజాస్వామ్య వ్యవస్థ అగ్రవర్ణాల చేతిలో బందీ అవుతోందని, రాబోయే రోజుల్లో రిజర్వేషన్లు ఎత్తివేసే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజా సంకల్ప ఐక్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కాస్తీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం దుబ్బాక పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్ని దశాబ్దాలుగా పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కొరవడిందన్నారు. బహుజన, మైనార్టీ వర్గాలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇకనైనా బడుగు బలహీన వర్గాలకు చెందిన మేధావులు, ప్రజా సంఘాల నాయకులు మేల్కొవాలని కోరారు. రిజర్వేషన్ల కుల గణనపై సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాం రామకృష్ణ ప్రభు, నాయకులు యాదగిరి, సాముల నాగరాజు, రాజు తదితరులున్నారు.

సెల్‌ఫోన్ పోయిందా.. వెంటనే ఫిర్యాదు చేయండి

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట కమాన్: ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సీపీ అనురాధ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2023 నుంచి ఇప్పటివరకు 978 సెల్‌ఫోన్లు సీఈఐఆర్ యాప్ నూతన టెక్నాలజీ ద్వారా గుర్తించి బాధితులకు అందజేశామన్నారు. సీఈఐఆర్ యాప్‌లో వివరాలు నమోదు చేస్తే సులభంగా ఫోన్ రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ యాప్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఫోన్ పోయినట్లు గుర్తించిన వెంటనే బాధితులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

పండుగలు.. మన సంస్కృతి ప్రతిబింబాలు

- పాశ్చాత్య పోకడలు వద్దు, మన సంప్రదాయాలే ముద్దు
- జిల్లా బీసీ సంక్షేమ, అభివృద్ధి శాఖ, పంచాయతీ అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మన పండుగలు, మన సంస్కృతి.. గర్వకారణంగా ఉంటాయని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యాసమహర్షి యోగా సొసైటీ, ఉద్యోగ, ఉపాధ్యాయుని తరుణి మహిళా అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఆషాఢ మాస గోరింటాకు సంబురాలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ, అభివృద్ధి శాఖ అధికారి సరోజ, పంచాయతీ అధికారి దేవకీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల వర్షాకాలంలో మహిళలకు తలెత్తే ఆరోగ్య సమస్యలను దూరం చేస్తుందన్నారు. మహిళలందరూ సామూహికంగా ఒకచోట చేరి గౌరీ మాత లక్ష్మీదేవి పూజలు చేయడం వల్ల మహిళలు సంఘటితం అవుతారన్నారు. పాశ్చాత్య పోకడలు హెచ్చుమీరుతున్న ప్రస్తుత తరుణంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షనీయమన్నారు. మహిళలు ఆరోగ్యంగా, మానసికంగా, దృఢంగా ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయ, మహర్షి యోగా సొసైటీ శిక్షకురాలు తోట సంధ్య, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి తోట సతీష్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



గోరింటాకు ఉత్సవంలో పాల్గొన్న జిల్లా అధికారులు, మహిళలు

రెండో విడతకు రెడీ

రూ.1.50లక్షల రుణమాఫీ నేడే

- జిల్లాలో 27,955 మంది రైతులు
- ఖాతాల్లో జమకానున్న రూ.279కోట్లు
- తొలి విడతలో 53,137 మందికి లబ్ధి
- రైతుల్లో హర్షాతిరేకాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రెండో విడత రుణమాఫీకి రంగం సిద్ధమైంది. మంగళవారం రెండో విడతలో భాగంగా రూ.1.50లక్షలు మాఫీ కానున్నాయి. జిల్లాలో రూ.2లక్షలు రుణం తీసుకున్న వారు 2.09లక్షల మంది రైతులు ఉన్నారు. వీరికి రూ.2,026 కోట్లు రుణాలున్నాయి. ఈ మొత్తం విడతల వారీగా మాఫీ అవుతున్నాయి. ఇప్పటికే మొదటి విడతలో రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేశారు. రెండో విడతలో రూ.1.5లక్షల వరకు రుణాలు మాఫీ చేయనున్నారు. 27,955 మంది రైతులకు రూ. 279,33,31,968 నేరుగా ఖాతాల్లో జమకానున్నాయి. ఈ నెల 18న రూ.లక్ష వరకు 53,137 రైతుల ఖాతాల్లో రూ.290,24,28,954 జమ చేశారు. ఇక రూ.లక్షన్నర నుంచి రెండు లక్షల రూపాయల వరకు మాఫీ చేయాల్సి ఉంది.

సీఎం వీడియో కాన్ఫరెన్స్..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించే రుణమాఫీ ప్రక్రియను కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు నేరుగా వీక్షించనున్నారు. అందుకు ప్రతి మండలం నుంచి ఐదుగురు రైతులు హాజరుకానున్నారు. కలెక్టర్, జిల్లా వ్యవసాయశాఖ, డివిజన్, మండల అధికారులు పాల్గొననున్నారు. అలాగే ప్రతి మండల కేంద్రంలోని రైతు వేదికలలో ముఖ్యమంత్రి కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తారు.



హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రుణాలను మాఫీ చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ బాధలు తీరుతున్నాయని సంబరపడుతున్నారు. అంతేకాక బ్యాంక్‌లో కొత్త రుణాలు తీసుకునే అవకాశం ఏర్పడనుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తమ రుణాలు తీర్చే వెసులుబాటు లేకపోయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే రుణాలను తీర్చుతుండటంతో రైతులు సంబురపడిపోతున్నారు.

రూ.279 కోట్లు జమ..



రెండో విడత రుణమాఫీలో జిల్లాలోని 27,955 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. వారి ఖాతాల్లో రూ.279,33,31,968లు జమకానున్నాయి. మంగళవారం మధ్యాహ్నం సీఎం రేవంత్‌రెడ్డి రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు. రుణమాఫీ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌తో పాటు రైతు వేదికలలో రైతులు, అధికారులు వీక్షించనున్నారు.

–మహేశ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

పారిశుద్ధ్యం పనులు ముమ్మరం

పర్యవేక్షిస్తున్న కమిషనర్ రమేశ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్

దుబ్బాక: సాక్షి ఫోన్ ఇన్ ఎఫెక్ట్‌తో దుబ్బాక మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల కమిషనర్ రమేశ్‌కుమార్‌తో సాక్షి నిర్వహించిన ఫోన్ ఇన్‌కు ప్రజల నుంచి పెద్ద ఎత్తున సమస్యలు వెల్లువెత్తాయి. కమిషనర్ నిత్యం వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్యం పనులను పర్యవేక్షిస్తున్నారు. అధ్వానంగా మారిన డ్రైనేజీలను దగ్గరుండి సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారు. మురికినీరు నిలువ ఉండకుండా చర్యలు చేపడుతున్నారు. దుంపలపల్లి రోడ్డులో ఏదుల్ల చెరువులోకి వెళ్లే పెద్ద డ్రైనేజీలో భారీగా పేరుకుపోయిన చెత్త చెదారాన్ని జేసీబీ సహాయంతో తొలగించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి చర్యలు చేపట్టారు. ఏదేమైనా 'సాక్షి ఫోన్ ఇన్'తో మున్సిపాలిటీలో వేగంగా పారిశుద్ధ్యం పనులు చేపడుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పారిశుద్ధ్యం పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ రమేశ్‌కుమార్

బీసీ డిక్లరేషన్ అమలు చేయాల్సిందే

సిద్దిపేటకమాన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్‌గౌడ్ డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగతా రాష్ట్రాల్లో జనాభా దమాషా పద్ధతి ప్రకారం బీసీలకు 60 నుంచి 70శాతం వరకు రిజర్వేషన్లు అందుతున్నాయన్నారు. కానీ తెలంగాణలో మాత్రం బీసీలకు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. ఎన్నికలకు ముందు బీసీలకు బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి బడ్జెట్‌లో రూ.9వేల కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. కులగణన చేపట్టిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో అనిల్, పవన్, భార్గవ్, ప్రభు, వెంకటేష్, గణేష్, అరుణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే..

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

దుబ్బాక: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేయడంలో రెండూ ఒక్కటేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగిడి మోహన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం దుబ్బాక పట్టణంలో పార్టీ మున్సిపాలిటీ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ మాయమాటలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. గత పదేళ్లు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను దోచుకోవడమే తప్ప ఒరుగబెట్టింది ఏమీలేదన్నారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా హామీలు అమలు చేయలేదన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ క్యాడర్ పట్టుదలతో పనిచేయాలన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకొని పార్టీ బలోపేతం కోసం ముందుకు సాగాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు అంబటి బాలేష్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తుల ఉమా, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షులు తిరుమల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

సాగునీరు వదలాల్సిందే

- వచ్చే నెల 2, 3 తేదీలే డెడ్‌లైన్
- లేదంటే రైతులతో కలిసి ఉద్యమిస్తాం
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: జిల్లాలోని మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ల నుంచి వచ్చే నెల 2, 3 తేదీల్లోగా సాగు నీరు వదలాల్సిందేనని, లేదంటే వేలాదిమంది రైతులతో కలిసి రోడ్డెక్కుతామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా... సమృద్ధిగా వర్షాల్లేక వరి సాగుకు అనువైన పరిస్థితులు లేవన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మల్లన్నసాగర్‌లో అందుబాటులో ఉన్న 5టీఎంసీలకుపైగా నీటిలో ఒక టీఎంసీని, కొండపోచమ్మసాగర్‌లో అందుబాటులో ఉన్న 3 టీఎంసీల్లో మరొక టీఎంసీ నీటిని విడుదల చేస్తే రైతులకు ఇబ్బందులు ఉండవన్నారు. ప్రధానంగా గజ్వేల్ నియోజకవర్గంలోని కూడవెల్లి, హల్దీ వాగుల్లోకి నీటిని వదలాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా కూడవెల్లి ప్రవాహం ఎగువ మానేరు వరకు కొనసాగుతుందని, హల్దీ వాగు ప్రవాహం మంజీరా నది వరకు కొనసాగి...ఈ రెండు వాగుల పరిధిల్లోని ఆయకట్టుకు నీరు అందుతుందన్నారు. దీంతోపాటు రామాయంపేట, సంగారెడ్డి, తుర్కపల్లి, జగదేవ్‌పూర్ కాల్వలకు సైతం నీళ్లు వదలాలన్నారు. ఇలా చేస్తే మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల్లో రైతులకు సాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు. కాల్వల ద్వారా ఆయా జిల్లాల్లోని చెరువులకు నీరందనుందని చెప్పారు. ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించాలని లేనిపక్షంలో మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో గజ్వేల్ నియోజకవర్గంలోని రాజీవ్‌రహదారితోపాటు ఇతర ప్రధాన రహదారులన్నీ రైతులతో కలిసి దిగ్బంధిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

ఉమ్మడి జిల్లాకు 87 కొత్త బస్సులు

సంగారెడ్డి టౌన్ : మెదక్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపోలకు కొత్తగా 87 కొత్త బస్సులు వచ్చినట్లు రీజియన్ మేనేజర్ ప్రభులత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ మెదక్ రీజియన్ పరిధిలో ఇప్పటివరకు మహాలక్ష్మి పథకం కింద 3.80 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని, ఈ పథకం తర్వాత 70% ఉన్న ఓఆర్ 98 శాతానికి చేరిందని చెప్పారు. రీజియన్ పరిధిలో 10 డీలక్స్, 35 పల్లెవెలుగు, 42 ఎక్స్‌ప్రెస్ బస్సులు కొత్తగా వచ్చాయని పేర్కొన్నారు.

సింగూరుకు ఇన్‌ఫ్లో..

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. సోమవారం 2,116 క్యూసెక్కుల నీరు చేరింది. వారం రోజుల నుంచి డ్యాంలోకి అర టీఎంసీల నీరు చేరిందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. డ్యాం నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.417 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు.

శిథిల ఇళ్లపై నజర్

- క్షేత్ర స్థాయిలో అధికారుల పరిశీలన
- ఇప్పటికే పురాతన ఇళ్ల గుర్తింపు
- 180 మంది యజమానులకు నోటీసులు
- చర్యలు చేపడుతున్న మున్సిపాలిటీలు

సిద్దిపేటజోన్: అసలే వానాకాలం.. ఆపై శిథిలావస్థకు చేరిన పురాతన ఇళ్లు గుబులు పుట్టిస్తున్నాయి. మరోవైపు శిథిల ఇళ్లల్లో చెత్త చెదారం, పాములు వంటి విష సర్పాలకు నిలయంగా మారుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో విషాద ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో జిల్లాలోని మున్సిపాలిటీలు ప్రత్యేక దృష్టిసారించాయి. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తున్నారు. పురాతన ఇళ్లను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. కూల్చివేతలకు చర్యలు చేపడుతున్నారు. ఇళ్ల స్థితిగతులు, నోటీసుల ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది.

- జిల్లాలో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ సిద్దిపేటతో పాటు గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్,చేర్యాల మున్సిపాలిటీలు ఉన్నాయి.
- మున్సిపల్ రికార్డుల ప్రకారం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 180 శిథిలావస్థకు చేరిన ఇళ్లను అధికారులు గుర్తించారు.
- పురాతనమైన, ప్రమాదకరంగా ఉన్న 180 ఇళ్ల యజమానులకు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు.
- శిథిలావస్థకు చేరిన ఇళ్లు ప్రమాదకరమని వాటిని స్వచ్ఛందంగా కూల్చివేయాలని సంబంధిత యజమానులకు నోటీసు ద్వారా సూచించారు.
- అయినప్పటికీ ఆయా మున్సిపాలిటీల్లో యజమానులు ముందుకు రాకపోవడంతో బల్దియా సిబ్బంది జేసీబీ ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 20 ఇళ్లను కూల్చివేసినట్లు సమాచారం.
- ఆయా మున్సిపాలిటీల్లో నివాస వసతి లేని అభాగ్యులను స్థానికంగా ఉండే డబుల్ బెడ్రూం ఇళ్లకు తాత్కాలికంగా తరలించారు.
- ఇంకా 150కి వరకు శిథిలావస్థకు చేరిన, పురాతన ఇళ్లు అలాగే ఉన్నాయి. వాటి వల్ల వర్షాకాలంలో పిట్ట గోడలు కూలి పొరుగున నివసించే జనాలకు ప్రమాదం పొంచి ఉందనే ఆందోళనలు ఉన్నాయి
- మరోవైపు పురాతన, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో చెత్త, పొదలు పెరిగి అపరిశుభ్రంగా మారడం, పాములు, తేళ్ల లాంటి వాటికి నిలయంగా మారుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి
- ప్రధానంగా ఈ సమస్యలు ఆయా మున్సిపాలిటీలో స్లమ్ ఏరియాల్లో అత్యధికంగా ఉన్నట్టు బల్దియా అధికారులు గుర్తించారు
- 60 నుంచి 80 ఏళ్ల క్రితం నిర్మించిన పెంకుటిల్లు, పురాతన భవంతుల స్థితిగతులు పరిశీలన చేసేందుకు బల్దియా కమిషనర్లు ఆయా మున్సిపాలిటీల్లో క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టారు.



క్షేత్ర స్థాయిలో పరిశీస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి (ఫైల్)

నోటీసులు జారీ చేశాం



వానాకాలం నేపథ్యంలో పురాతన, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో నివాసం ప్రమాదకరం. అలాంటి ఇళ్లను గుర్తించి నోటీసులు జారీ చేశాం. కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇండ్లను సంబంధిత యజమానులు స్వచ్ఛందంగా కూల్చివేయాలని సూచించాం. ఇందుకు ఇంటి యజమానులు కూడా సహకరించాలి.

–ప్రసన్న రాణి, మున్సిపల్ కమిషనర్ సిద్దిపేట

క్లుప్తంగా

నేడు అసెంబ్లీ ముట్టడి

మెదక్ కలెక్టరేట్: సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం మంగళవారం అసెంబ్లీ ముట్టడి చేయనున్నట్లు సీఆర్పీల జిల్లా అధ్యక్షుడు గట్టయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది వరంగల్ సభలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన కార్యక్రమానికి విచ్చేసి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చాక మా సమస్యలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

గిఫ్ట్ వాచర్ పేరుతో సైబర్ మోసం

రూ.2.50 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి



పటాన్‌చెరు టౌన్: గిఫ్ట్ వాచర్ పేరుతో జరిగిన సైబర్ మోసంలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ పరిధిలోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూలై 17వ తేదీన ఆపిల్ ప్లే స్టోర్ లో గిఫ్ట్ వాచర్లు కొనుగోలు చేస్తే నగదు రెట్టింపు వస్తాయని మెసేజ్ వచ్చింది. బాధితుడు అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా నమ్మి తన వివరాలు ఇచ్చి, గిఫ్ట్ వాచర్ కొనుగోలుకు పలు దఫాలుగా రూ.2.50 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. తీరా పెట్టిన నగదుతోపాటు రెట్టింపు వస్తాయని చెప్పిన నగదు ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. తాను మోస పోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్నీఫర్ డాగ్‌తో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

జహీరాబాద్: జహీరాబాద్‌కు సమీపంలోని బీదర్ క్రాస్ రోడ్డు వద్ద ఎస్పీ సీహెచ్ రూపేష్ ఆదేశాల మేరకు క్లూస్ టీమ్‌కు చెందిన స్నీఫర్ డాగ్ సాయంతో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్‌ఐ కాశీనాథ్ తన సిబ్బందితో కలిసి రాష్ట్రంలోకి ప్రవేశించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అంతర్‌రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో ఏమైనా డ్రగ్స్ రాష్ట్రంలోకి వస్తున్నాయా అనే కోణంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి మాదక ద్రవ్యాలు లభ్యం కాలేదని పోలీసులు పేర్కొన్నారు.

మతిస్థిమితం కోల్పోయి.. ఒంటికి నిప్పంటించుకొని

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి



సాయి (ఫైల్)

దుబ్బాకటౌన్: మతిస్థిమితం కోల్పోయి ఒంటికి నిప్పంటించుకున్న యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుబ్బాక ఎస్సై గంగరాజు కథనం మేరకు.. మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట వార్డుకు చెందిన కాస్తి సాయి (27)కి నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. అనంతరం కొన్ని నెలలకు మతిస్థిమితం కోల్పోయి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో భార్య విడాకులు తీసుకుంది. నేను చనిపోతాను అంటూ తల్లిదండ్రులతో తరుచూ గొడవ పెట్టుకునేవాడు. 24వ తేదీన రాత్రి కుటుంబ సభ్యులు నిద్రపోయాక ఒంటి గంట సమయంలో కట్టెల పొయ్యి వెలిగించుకునే డీజిల్ తీసుకొని ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. అరుపులు విన్న తల్లిదండ్రులు బయటికి వచ్చి స్థానికులతో సాయంతో మంటలను ఆర్పేశారు. తీవ్ర గాయాలైన సాయిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. సోమవారం మృతుడి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14415]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఫైనాన్స్ మాఫియా!

సెకండ్ హ్యాండ్ బైక్‌లకు వడ్డీల మీద వడ్డీ

- వాయిదాలు ఆలస్యమైతే అధిక చార్జీలు
- రూ.కోట్లలో గుట్టుగా దందా
- దొంగ బైక్‌లకు నకిలీ పత్రాలు సృష్టించి విక్రయం
- వ్యాపారుల ఉచ్చులో చిక్కుతున్న యువత, చిరుద్యోగులు
- అధికారుల నియంత్రణ కరువు



గోదాంలో పెద్ద సంఖ్యలో దాచిన సెకండ్ హ్యాండ్ బైక్‌లు

పట్టణానికి చెందిన అంకిత్ అనే యువకుడు ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నాడు. పనిలో భాగంగా అక్కడక్కడా తిరగాల్సి రావడంతో మోటార్ సైకిల్ అవసరం పడింది. దీంతో సెకండ్ హ్యాండ్ బైక్‌లు విక్రయించేవారి వద్ద రూ.60 వేలకు బైక్ మాట్లాడుకున్నాడు. మొదట రూ.20 వేలు చెల్లించి బైక్ తీసుకున్నాడు. మిగితా డబ్బులు నెలనెలా ఈఎంఐ రూపంలో చెల్లిస్తానని నిర్వాహకుల వద్దే అధిక వడ్డీకి ఫైనాన్స్ చేసుకున్నాడు. రెండు నెలలు వాయిదా పద్ధతిలో డబ్బులు చెల్లించాడు. ఈ క్రమంలోనే కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఫైనాన్స్ కట్టలేదు. వెంటనే ఫైనాన్స్ వారు వచ్చి బైక్ తీసుకెళ్లారు. దీంతో ఉన్న ఉద్యోగం కూడా పోయింది. ఇది కేవలం అంకిత్ పరిస్థితే కాదు. విద్యార్థులు, కార్మికులు, చిరు వ్యాపారులందరిదీ ఇదే పరిస్థితి.

తూప్రాన్: ఈజీ ఫైనాన్స్ ముసుగులో రూపాయికి రూపాయి.. వడ్డీలకు చక్రవడ్డీ.. ఏ చట్టానికి చిక్కకుండా గుట్టుగా వ్యాపారం.. ఆటోమొబైల్ వ్యాపారంలో బడా ఆర్థిక నేరం.. బడుగులే టార్గెట్.. యువత కోరికలు, బలహీనతలే కాసులు కురిపిస్తున్నాయి.. పల్లెలకు సైతం విస్తరించిన సెకండ్ హ్యాండ్ బైక్ ఫైనాన్స్ సంస్థలపై

'సాక్షి' ప్రత్యేక కథనం..

పుట్టగొడుగుల్లా షోరూమ్‌లు

ప్రతీ మండల కేంద్రంలోనూ సెకండ్ హ్యాండ్ బైక్ షోరూమ్‌లు ఇబ్బడి ముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి. చిన్నచిన్న వ్యాపారులు, రోజువారి కూలీలు, చిరుద్యోగులు, దిగువస్థాయి, మధ్యతరగతి వారికి యువకులు, కాలేజీ స్టూడెంట్లకు ఎటువంటి షరతులు లేకుండా కేవలం ఖాళీ ప్రామిసరీ నోట్లు, బ్లాంక్ చెక్కులతో సెకండ్ హ్యాండ్ బైక్‌లను నెలవారి చెల్లింపుల పద్ధతిలో అమ్ముతున్నాయి. దీంతో ఈ వర్గాల జనానికి బైక్ ముచ్చట తీరుతోంది. కానీ బైక్ తీసుకున్న తర్వాత అసలు కష్టాలు ప్రారంభమవుతున్నాయి. బైక్ సొంతం చేసుకోవాలనే కుతూహలంతో ఫైనాన్షియర్లు చెప్పిన చోటల్లా సంతకాలు చేస్తున్నారు. నెల వాయిదా ఆలస్యం అయితే ఈ మొత్తం రోజువారి వడ్డీ కింద వ్యాపారులు లెక్కిస్తారు. వాయిదాల వసూలుకు ఎన్ని దఫాలు వస్తే చార్జీలు అదనంగా చెల్లించాలి. ఇదంతా అప్పుడికప్పుడు తెలియదు. వాయిదాలు అన్నీ తీరాక బైక్ ఆర్‌సీ బుక్ అడిగితే ఇవన్నీ లెక్కగట్టి ఆఖరులో చెబుతారు. కొనుగోలు దారులకు బైక్‌పై ఎలాంటి హక్కులు లేకపోవడంతో నోరెత్తకుండా నగదు చెల్లించి బయటపడుతున్నారు.

వెనక్కిరాని డబ్బులు

ఇదిలా ఉంటే మరికొన్ని కేసుల్లో ధరలో పాతికి శాతం డబ్బు కడితే బైక్ ఇస్తున్నారు. తర్వాత రెండు వాయిదాలు సరిగా కట్టకపోతే బైక్‌ను ఫైనాన్షియర్ మనుషులు స్వాధీనం చేసుకుంటారు. ఇటువంటి సందర్భంలో ముందు చెల్లించిన పాతిక శాతం డబ్బులూ వెనక్కి ఇవ్వరు. ఇలా వీరు దోపిడీకి పాల్పడినా అడ్డుకునేందుకు వీలుగా నిబంధనలు లేవు. దొంగిలించిన వాహనాలు, ప్రమాదాలకు గురైన వాహనాలను సైతం సులువుగా అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అసలు వ్యాపారులు హైదరాబాద్‌లో కార్యాలయం ప్రారంభించి బ్రాంచీలుగా పల్లెల్లో నిరుద్యోగ యువకులను ఏజెంట్లుగా ఎంపిక చేసుకొని వ్యాపారం సాగిస్తున్నారు. ఇటీవలె తూప్రాన్‌లో బైక్ జోన్‌లపై పోలీసులు దాడులు నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

దారి తప్పుతున్న విద్యార్థులు

చాలా మంది యువకులు కాలేజీలకు బైక్‌లపైనే వెళ్తున్నారు. ఇంట్లో తల్లిదండ్రులకు కొనే పరిస్థితి లేకున్నా ఒత్తిడి చేయడంతో ఫైనాన్స్‌లో బైక్ ఇప్పిస్తున్నారు. తీరా కొన్ని నెలలపాటు ఫైనాన్స్ డబ్బులు కట్టకపోయేసరికి విద్యార్థుల ఇళ్ల వద్ద ఫైనాన్షియర్లు గొడవ చేస్తే పరువుపోతుండటంతో పుస్తెలు తాకట్టు పెట్టి మరీ అప్పులు తీరుస్తున్నారు. అంతేకాకుండా దొంగ బైక్‌లకు నకిలీ పత్రాలు సృష్టించి విక్రయిస్తున్నట్లు సమాచారం. పోలీసు కేసుల్లో పట్టుబడినప్పుడు ఈ విషయం బహిర్గతమవుతున్న ఘటనలు ఉన్నాయి. సులువుగా అప్పు దొరికేసరికి ఈ ఊబిలో చిక్కుకుపోతున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> సెకండ్ హ్యాండ్ బైక్‌ల విక్రయాలు పట్టణాలు, గ్రామాల్లో కొనసాగుతున్నాయి. సులభ వాయిదాల్లో బైక్ కొనాలనుకున్నవారు సెంకడ్ హ్యాండ్ కొనుగోలు చేస్తున్నారు. బైక్‌కు సంబంధించిన ధ్రువపత్రాలు సరిగా చూసుకోకుండా కొనుగోలు చేస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వారు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. అలాగే, వ్యాపారులు ఫైనాన్స్ పేరులతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ డబ్బులు అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.
>
> – రంగాకృష్ణ, సీఐ తూప్రాన్

పట్టించుకోని అధికారులు

ఫైనాన్స్ వ్యాపారానికి ఎటువంటి చట్టబద్ధత ఉండదు. ఎంత వడ్డీ గుంజుకున్నా ఇచ్చేవాడి ఇష్టం.. తీసుకునే వాడి అవసరం అన్నట్లుగా సాగిపోతుంది. సెకండ్ హ్యాండ్ బైక్ అయినప్పటికీ తక్కువకు కొని ఎక్కువ ధరకు అమ్మడం జరుగుతుంది. పెద్ద పెద్ద షోరూంలు ఏర్పాటు చేస్తున్నా కస్టమ్స్ శాఖ గానీ, వాణిజ్య పన్నుల శాఖ గానీ, మున్సిపాలిటీ, పంచాయతీలు చర్యలు తీసుకోవడం లేదు. సామాన్యులను అప్పుల ఊబిలో దించే ఈ వ్యాపారంలో కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు సాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ఘోర రోడ్డు ప్రమాదం

- టవేరా వాహనాన్ని ఢీకొట్టిన ట్రక్కు
- అక్కడికక్కడే ఇద్దరు మృతి, మరో ఆరుగురికి గాయాలు
- శుభకార్యానికి వెళ్లొస్తూ తిరిగిరాని లోకాలకు..
- న్యాల్‌కల్ మండలంలోని హుస్సెల్లి గ్రామ శివారులో ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం



షాహేదాబేగం(ఫైల్)



సిరాజుద్దీన్(ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): శుభకార్యానికి వెళ్లి తిరిగొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని హుస్సెల్లి గ్రామ శివారులో చోటు చేసుకొంది. జహీరాబాద్ రూరల్ సీఐ జెక్కుల హన్మంత్ కథనం మేరకు.. కర్నాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన షాహేదాబేగం(45) కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 28న హైదరాబాద్‌లో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లారు. అనంతరం అదే రోజు రాత్రి టవేరా వాహనంలో బీదర్‌కు బయలు దేరారు. మంగళవారం తెల్లవారుజామున న్యాల్‌కల్ మండల పరిధిలోని హుస్సెల్లి గ్రామ సమీపంలోకి రాగానే బీదర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రక్కు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టవేరా వాహనం పల్టీలు కొట్టి రోడ్డు పక్కన బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న షాహేదాబేగం, డ్రైవర్ సిరాజుద్దీన్(26)కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. షేక్ అమాన్‌కు తీవ్ర గాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలో గల బీదర్‌లోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ నరేశ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ : ఒకరు మృతి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో వంట మాస్టర్ మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి కథనం మేరకు.. అమీన్‌పూర్ మండలం పరిధిలోని దయ్యారా గ్రామానికి చెందిన రేష్మి జ్ఞానేశ్వర్(36) సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్కు సమీపంలో టిఫిన్ సెంటర్ వద్ద వంట మాస్టర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పటాన్‌చెరు మండలం ముత్తంగిలో ఉండే సోదరుడు తుకారాం వద్దకు వెళ్లాడు. తిరిగి రాత్రి దయ్యారా గ్రామం వైపు బైక్ పై వస్తుండగా పోచారం ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జ్ఞానేశ్వర్‌ను స్థానికులు 108 వాహనంలో చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు..

గజ్వేల్‌రూరల్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారులో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. వర్గల్ మండలం అంబర్‌పేటకు చెందిన ఎల్లం(50) ప్రజ్ఞాపూర్ శివారు రింగురోడ్డు సమీపంలోని ఓ మామిడి తోటలో 8 ఏళ్లుగా సూపర్‌వైజర్‌గా పని చేస్తూ.. కూలీలతో పనులు చేయిస్తున్నాడు. సోమవారం మామిడి తోటలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా భూమిపై విద్యుత్ వైర్లు తగిలాయి. వాటిని తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఘటన భానూరు బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రామచంద్రాపురం మండల పరిధిలోని నాగులపల్లికి చెందిన రమేశ్(35)కు 2016లో వివాహం జరిగింది. 2017లో భార్య విడాకులు ఇచ్చి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసైన అతడు ప్రతిరోజూ మద్యంతోపాటు కల్లు సేవించేవాడు. ఆదివారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఇంట్లోకి వెళ్లాడు. సోమవారం ఉదయం ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో సోదరుడు భాస్కర్ వెళ్లి చూడగా ఇంట్లో ఉరి వేసుకొని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

అత్తపై అల్లుడు కత్తితో దాడి

కొమురవెల్లి(సిద్దిపేట): అత్తపై అల్లుడు కత్తితో దాడి చేసిన ఘటన కొమురవెల్లిలోచోటు చేసుకుంది. సోమవారం ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయ పరిసరాల్లో బొమ్మల విక్రయ దుకాణం నిర్వహిస్తోంది పాతకోటి చంద్రకళ. ఆమె పెద్ద కుమార్తె మౌనికను 2010లో లక్ష్మీదేవిపల్లికి చెందిన ఎల్లారెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. కొన్ని రోజులపాటు కాపురం సవ్యంగా సాగింది. కొద్ది రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అత్త వల్లే భార్య కాపురానికి రావడం లేదని కక్ష పెంచుకున్న అల్లుడు ఆదివారం అర్ధరాత్రి ఆమె కత్తితో దాడి చేశాడు. దీంతో రెండు చేతులకు గాయాలయ్యాయి. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్‌ఐ దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా ఫలహారబండి ఊరేగింపు

హాజరైన ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి



ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి



ఫలహారబండిలో దుర్గామాత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గోమారంలో సోమవారం రాత్రి ఫలహారబండి ఊరేగింపు కనుల పండువగా చేపట్టారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఎమ్మెల్యే సునీతారెడ్డి నివాసంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేపట్టారు. పోతరాజుల విన్యాసాలు, జోగినీలతో బోనాల ఊరేగింపు చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన ఫలహారబండి పై దుర్గమాత, తొట్టెల ఊరేగింపు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా చేపట్టారు. ఉత్సవాల్లో పాల్గొన్న అతిథులు, బీఆర్ఎస్ నాయకులను ఎమ్మెల్యే సన్మానించారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని దుర్గామాతకు వేడుకున్నట్లు సునీతారెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు కల్లూరి హరికృష్ణ, చంద్రాగౌడ్, మన్సూర్, రమాకాంత్ రెడ్డి, హన్మంత్‌రెడ్డి, కృష్ణారావు, యాదగౌడ్, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, శ్రీశైలం, బాబురావ్, వీరేష్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

అడవిలో కోట.. అపూర్వ చరిత్ర

హుస్నాబాద్ శివారులో చాళుక్యుల కాలం నాటి ఆనవాళ్లు


- ఎత్తయిన గుట్టలపై కోట నిర్మాణం
- రెండు వైపుల ముఖద్వారాలు
- తెలంగాణ చరిత్రకారుల పరిశోధనలో వెలుగులోకి..
- మధ్యలో నిండుకుండలా మహాసముద్రం లాంటి జలాశయం
- ప్రకృతి అందాలు, పర్యాటకులను ఆకర్షించే గట్లు



గుట్టల కింద మహాసముద్ర జలాశయం



మధ్యయుగం నాటి పరికరాలు



కోటపై శిథిల దేవాలయం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌కు 5 కిలో మీటర్ల దూరంలోని మహ్మదాపూర్, ఉమ్మాపూర్, అకునూర్ గ్రామాలను ఆనుకొని 800 మీటర్ల ఎత్తయిన కోటగిరి గట్ల మీద పురాతన రాతి కోట ఉంది. 3,200 ఎకరాల విస్తీర్ణంలోని అటవీ ప్రాంతంలో 36 గుట్టల సమూహం ఉండటంతో ఇక్కడికి ఎవరూ రాక కోటల చరిత్ర వెలుగులోకి రాలేదు. వెయ్యి ఏళ్ల కిందటి చాళుక్యుల కాలంలో కోటలను నిర్మించినట్లు ఇక్కడి కట్టడాల అనవాళ్లు చెప్పుతున్నాయి.

పూర్వం కరీంనగర్, వేములవాడ ప్రాంతాలను పాలించిన చాళుక్యుల వంశీయులు ఈ కోటలను వారి రక్షణ కోసం నిర్మించి ఉంటారని చరిత్రకారులు చెబుతున్నారు. సర్వాయి పాపన్న ఈ కోటను తన స్థావరంగా ఏర్పాటు చేసుకొని చివరి రోజులు ఇక్కడే గడుపడంతో దీన్ని సర్వాయి పాపన్నకోటగా పిలుస్తుంటారు. 12వ శతాబ్దం పూర్వమే చాళుక్యుల వంశీయులు అడవిలో రహస్యంగా కోటను నిర్మాణం చేసి ఉంటారని, ఈ గుట్టల కిందనే మహాసముద్రం జలాశయం నిర్మించగా 50 ఏళ్ల కిందట గండిపడి అలాగే ఉంది. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ అటవీ ప్రాంతం సందర్శించి గండి పూడ్చి జలాశయం చేస్తానని మాట ఇచ్చి పనులు చేయించడంతో ఇప్పుడు మహాసముద్రం 0.5 టీఎంసీల రిజర్వాయర్‌గా మారింది.

గుప్త నిధుల కోసం తవ్వకాల ఆనవాళ్లు

ఈ కోటను చేరుకోవడానికి అడవి మార్గాన 3 కిలో మీటర్లు నడవాలి. పైన 4 నుంచి 5 ఎకరాల్లో విస్తరించిన కోటను సర్వాయి పాపన్నే కట్టించాడని ఇక్కడి ప్రజలు చెప్పుకుంటారు. కోట ద్వారాల్లో ఒకటి మహ్మదాపూర్ వైపు, మరొకటి ఉమ్మాపూర్ వైపు ఉన్నాయి. కొండ్లె బుచ్చమ్మ గదిగా పిలుచుకొనే గదిని సైనిక పహారా కోసం కట్టిన గది, కొండ్లె బుచ్చమ్మ సర్వాయి పాపన్న ప్రియురాలు అని చెప్పుకుంటారు. 2 దేవాలయాలు ఉండగా ఇందులో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు ఉన్నాయి. గుట్టల కింద ఒక జలాశయం ఉంది. పూర్వం కోట లోపల నివసించే వారి బట్టలు ఉతికే వాళ్లని అందుకే దానిని చాకలోల్ల గుండం అని పిలుస్తారని గ్రామస్తులు చెబుతున్నారు. ఒక చోట రాతితొట్టి, గుట్ట మీద లభించిన కుండ పెంకులు మధ్యయుగం నాటివని చెప్పుకొచ్చారు. కోటకు రహస్య ద్వారాలు ఉన్నట్లు ఒకటి, రెండుచోట్ల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.

కొత్త తెలంగాణ చరిత్ర బృందం పర్యటన

మహ్మదాపూర్ వైపు కిందికి దిగితే ఒక చిన్న మట్టి తొవ్వ కనిపిస్తుంది. దానిని స్థానికులు గాడిదల బాట (తొవ్వ) అని పిలుస్తున్నారు. పూర్వం ఈ దారి గుండానే గాడిదల ద్వారా నీటిని పైకి తీసుకెళ్లేవారని, అందుకే గాడిదల బాటగా ప్రాచుర్యం పొందింది. ఇంత పెద్దకోట ఇక్కడ నిర్మించిందెవరో కోట గురించి తెలిపే శాసనాలు, చారిత్రక ఆధారాలు దొరకలేదు. కొన్నేళ్ల కిందట కొత్త తెలంగాణ చరిత్ర బృందం కోటను పరిశీలించి ఆనవాళ్లను పరిశీలించారు. పలు ఆధారాలను సేకరించి పరిశోధన చేస్తున్నారు.



భైరవుడి విగ్రహాన్ని పరిశీలిస్తున్న పురవాస్తుశాఖ బృందం (ఫైల్)

పర్యాటక కేంద్రానికి అనువైన ప్రదేశం



ఆనాడే ఆధ్యాత్మిక చింతన కోసం కాలభైరవ విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజించారు. దుర్గం కింద రక్షణ కోసం 8 చెక్ పోస్టులు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. శత్రువుల దాడిని తిప్పికొట్టేందుకు యుద్ధ నైపుణ్యంతో చెక్ పోస్టులను ఏర్పాటు చేసుకున్నారు. పర్యాటక కేంద్రం ఏర్పాటు చేసి ఇక్కడ ఎత్తయిన కాలభైరవ విగ్రహం దగ్గర దేవాలయం నిర్మిస్తే పర్యాటకుల రాకతో ఆధ్యాత్మిక చింతన నెలకొంటుంది. మహాసముద్రం జలాశయం నుంచి ఖిల్లా పైకి రోప్ వేలను ఏర్పాటు చేస్తే పర్యాటకులు సులభంగా ఖిల్లా పైకి పోవడంతో పాటు అడవి అందాలను తిలకించే అవకాశం ఉంటుంది.

– పీ.నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్, తెలంగాణ వారసత్వశాఖ

చాళుక్యుల కాలం నాటి ఆధారాలు



నేను 2021 జనవరిలో కోటను సందర్శించి పరిశోధన చేసినప్పుడు సర్వాయి పాపన్న ఉండటానికి ముందే కోట నిర్మాణం జరిగినట్లు ఆధారాలు లభించాయి. వెయ్యి ఏళ్ల కిందటి చాళుక్యుల రాజ్యం రక్షణ కోసం ఎత్తైన గుట్టల పై కోట నిర్మాణం చేసుకున్నట్లు ఉన్నాయి. కోటకు రెండు వైపుల ముఖ ద్వారాలు, కోటకు రహస్య ద్వారాలు కూడా ఉన్నట్లు గుర్తించాం. కోట పైకి రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తే మహాసముద్రం పర్యాటక కేంద్రంగా ఏర్పడి చరిత్రను తెలుసుకొనే అవకాశం అందరికీ కలుగుతుంది.

– కొలిపాక శ్రీనివాస్, చరిత్ర పరిశోధకుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం